క్లుప్తంగా

కాలువలకు నీటి విడుదల


పశ్చిమ డెల్టా ప్రధాన కాలువ

నిడదవోలు: విజ్జేశ్వరం హెడ్ స్లూయిజ్ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు నీటిని విడుదల చేస్తున్నారు. గోదావరి పశ్చిమ డెల్టా పరిధిలో రైతుల సాగునీటి అవసరాల మేరకు జలవనరుల శాఖ ధవళేశ్వరం హెడ్‌వర్క్స్ అధికారులు నీటి విడుదలను ఎప్పటికప్పుడు క్రమబద్ధీకరిస్తున్నారు. పశ్చిమ డెల్టా పరిధిలో నరసాపురం కాలువకు అత్యధికంగా 1,534 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఏలూరు కాలువకు 826, తణుకు కాలువకు 1,200, అత్తిలి కాలువకు 88 క్యూసెక్కుల చొప్పున వదుతున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: స్థానిక 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు జరుగుతున్నందున శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎన్.నారాయణ అప్పారావు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ అచ్చియపాలెం, గొల్లగూడెం, దేవరపల్లి ఎంహెచ్‌క్యూ, బందపురం, ఇండస్ట్రియల్, మార్కెట్ 11 కేవీ ఫీడర్లపై ఉన్న గృహ, వాణిజ్య, వ్యవసాయ వినియోగదారులకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు వివరించారు. గొల్లగూడెం, బందపురం, దేవరపల్లి గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందన్నారు. వ్యవసాయానికి ఉదయం 5 నుంచి 9 గంటల వరకూ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సరఫరా ఇవ్వనున్నామని తెలిపారు.

మహా కుంభమేళాకు ఆర్టీసీ సర్వీసు

నిడదవోలు: భక్తుల సౌకర్యార్థం మహా కుంభమేళాకు ఏపీఎస్ ఆర్టీసీ నిడదవోలు డిపో నుంచి శుక్రవారం ప్రత్యేక బస్ సర్వీస్ నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ బస్సు మధ్యాహ్నం 12 గంటలకు బయలు దేరుతుందన్నారు. 8 రోజుల పాటు యాత్ర సాగుతుందని, ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జీతాలకు డబ్బుల్లేవా.. సీసీ కెమెరాలకు ఎలా వచ్చాయి?

గోపాలపురం: ఏడు నెలలుగా జీతాలు చెల్లించకుండా కాంట్రాక్టర్, కూటమి ప్రభుత్వం తమను నానా ఇబ్బందులకూ గురి చేస్తున్నారని సత్యసాయి మంచినీటి పథకం కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు జీతాలు చెల్లించడానికి డబ్బుల్లేవంటున్నారని.. అటువంటిది సత్యసాయి మంచినీటి పథకం ట్యాంకుల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. గోపాలపురం మంచినీటి ట్యాంకు వద్ద గురువారం వారు నిరసన తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాగానే తమను రెగ్యులర్ చేస్తామని, మొత్తం ఖర్చు ప్రభుత్వం భరిస్తుందని యువగళం పాదయాత్రలో ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చి, మాట తప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నెలాఖరులోగా జీతాలు చెల్లించకపోతే నీటి విడుదలను నిలుపు చేస్తామని, తదుపరి కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు.

ర్యాంపు పరిధి పెంచేందుకు చర్యలు


ప్రజాభిప్రాయ సేకరణ సభలో మాట్లాడుతున్న అధికారులు

నిడదవోలు రూరల్: ఇసుక లభ్యతను దృష్టిలో పెట్టుకుని పెండ్యాల ర్యాంపు పరిధి పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మైనింగ్ ఏడీ ఫణిభూషణ్ రెడ్డి అన్నారు. నిడదవోలు మండలం పెండ్యాల గ్రామంలో ఇసుక ర్యాంపు పరిధి పెంపుపై ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల ఏకాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని ర్యాంపును విస్తరిస్తామన్నారు. 30.8 హెక్టార్లలో ఏడాదికి 3,08,000 క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకం చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. పలువురు మాట్లాడుతూ పెండ్యాల ఇసుక ర్యాంపు వద్ద అధికారుల పర్యవేక్షణ ఉండాలని కోరారు. సమావేశంలో కాలుష్య కంట్రోల్ ఈఈ శంకరరావు, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, ఎస్సై కె.వీరబాబు, ఆర్ఐ సత్యేంద్ర పాల్గొన్నారు.

స్థలం ఆక్రమించారంటూ ఫిర్యాదు

నల్లజర్ల: స్థానిక సూర్య హోటల్ పక్కనున్న తన స్థలాన్ని కవులూరుకు చెందిన ఓ వ్యక్తితో పాటు అతని అనుచరులు ఆక్రమించారంటూ నల్లజర్లకు చెందిన షేక్ బాజీ కుమారుడు చంద్‌షికి పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన స్థలంలో కంటైనర్ బాక్స్ తీసుకువచ్చి పెట్టారన్నారు. బుధవారం రాత్రే ఈ స్థల ఆక్రమణకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారని, అయినా గురువారం ఆంధ్రప్రభ పేరుతో ఉన్న కంటైనర్ బాక్స్ తీసుకొచ్చి పెట్టారని బాధితుడు వాపోయాడు. దీనిపై పోలీసులు స్పందించి వెంటనే తొలగించాలని కోరారు.

చదువు చెప్పి.. సంస్కారం నేర్పి

- పూర్వపు 'పశ్చిమ'లో 32 బాలవికాస్ కేంద్రాలు
- పుల్లలపాడు కేంద్రంలో చిన్నారులకు శిక్షణ


పుల్లలపాడు బాలవికాస్ కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

నల్లజర్ల: భారతీయ సనాతన ధర్మాన్ని, సంస్కృతీ సంప్రదాయాలను పిల్లలకు విద్యార్థి దశ నుంచే నేర్పించాలన్న సంకల్పంతో పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాలో 32 చోట్ల బాలవికాస్ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. సమరసత సేవా ఫౌండేషన్ కొవ్వూరు డివిజన్ ధర్మ ప్రచారక్ ఉప్పలపాటి మాధవరావు ఆధ్వర్యాన మండలంలోని పుల్లలపాడు వేములమ్మ గుడి ప్రాంగణంలో బాలవికాస్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఇక్కడ పది పన్నెండేళ్ల వయస్సు పిల్లలకు సాయంత్రం వేళల్లో చదువు చెప్పడంతో పాటు సంస్కారాన్ని నేర్పుతారు. మాతృ దేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవోభవ, పరోపకారం, మన కుటుంబం, మన గ్రామం, దేశం ఇలా ప్రతి అంశంపై అవగాహన కల్పిస్తారు. చదువుతో పాటు సత్యం, శాంతి, కరుణ, క్రమశిక్షణ, క్షమ, సమయ పాలన, సేవాధర్మం, ఆత్మవిశ్వాసం, న్యాయం, సమత, మమత వంటి గుణశీలాలతో కూడిన ఆధ్యాత్మిక విద్యను బోధిస్తారు. ఈ కేంద్రాల్లో మాతాజీలను (వలంటీర్లు) ఏర్పాటు చేశారు. పిల్లల్లో చదువుతో పాటు వారిలో సంస్కార విలువలు పెంపొందించడమే లక్ష్యంగా ఈ బాల వికాస్ కేంద్రాలు పని చేస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు బడి నుంచి వచ్చాక పుస్తకాలను పడేసి ఆటపాటలకు, వారి కులవృత్తుల పనులకు వెళ్లిపోతూంటారు. చదువు పట్ల అంతగా శ్రద్ధ చూపరు. అటువంటి వారిని సాయంత్రం వేళల్లో పాఠశాలల్లో చెప్పిన పాఠాలు చదివించడం, ఇంటి పని చేయించడం, ఏవైనా సందేహాలుంటే నివృత్తి చేయడం వంటి వాటితో పాటు దేశభక్తి గేయాలు, ఆటపాటలు, సుభాషితాలు, అమృత వచనాలు, ఆసనాలు, సూర్య నమస్కారాలు, దేశభక్తికి సంబంధించి నీతి కథలను ఈ బాల వికాస్ కేంద్రాల్లో చెబుతూంటారు. వ్యక్తిగత పరిశుభ్రత, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పట్ల గౌరవం, చదువులో రాణించడం వంటి అంశాలు నేర్పిస్తారు. ఆయా అంశాల్లో నిష్ణాతులైన వారితో స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు ఇప్పిస్తూంటారు.

ప్రాథమిక స్థాయి నుంచే..



ప్రాథమిక స్థాయి నుంచే పిల్లలకు నైతిక విలువలు, దేశభక్తి, మన సంస్కృతీ సంప్రదాయాలు తెలియజెప్పే విధంగా ప్రతి రోజు పాఠశాల విడిచిపెట్టిన తర్వాత ఒక గంట, ఆదివారం రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ముఖ్యంగా తల్లిదండ్రులు, పెద్దలతో ఏవిధంగా మసలుకోవాలి, దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన విధానం, అందుకు కష్టపడిన నాయకుల జీవిత చరిత్రలు, హిందూ ధర్మం గురించి, భారత, రామాయణేతిహాసాల గురించి ఇక్కడ తెలియజెపుతారు.

– ఉప్పలపాటి మాధవరావు, ధర్మప్రచారక్, సమరసత సేవా ఫౌండేషన్, కొవ్వూరు డివిజన్

'పోషణ్ బీ.. పఢాయి బీ'పై శిక్షణ


శిక్షణను ప్రారంభిస్తున్న హెచ్ఎం కోమలిచిత్ర, ఏసీడీపీఓ పద్మావతి


కార్యక్రమానికి హాజరైన అంగన్‌వాడీ కార్యకర్తలు


శిక్షణకు హాజరైన అంగన్‌వాడీలు

నల్లజర్ల: బాల్య సంరక్షణ, అంగన్‌వాడీ పథకం అందించే దిశగా కేంద్ర ప్రభుత్వం పోషణ్ బీ.. పఢాయి బీ పేరిట కొత్త పథకం ప్రారంభించనున్నదని ఐసీడీఎస్ గోపాలపురం ప్రాజెక్ట్ ఏసీడీపీఓ పద్మావతి అన్నారు. నల్లజర్ల సెక్టార్‌లోని అంగన్‌వాడీ కార్యకర్తలకు స్థానిక హైస్కూలులో మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అనుబంధ పోషకాహారం, ప్రారంభ సంరక్షణ, విద్యను అందించే దిశగా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆరేళ్ల వయస్సుకు ముందే పిల్లల్లో మెదడు 85 శాతం అభివృద్ధి చెందుతుందని, అంగన్‌వాడీ పర్యావరణ వ్యవస్థ, పిల్లల భవిష్యత్తును సురక్షితంగా ఉంచేందుకు ఈ కార్యక్రమం పునాదిగా ఉంటుందని చెప్పారు. జాతీయ పాఠ్య ప్రణాళికలో ప్రతి రంగంలోనూ పిల్లల అభివృద్ధిని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. పూర్వ ప్రాథమిక విద్యకు ప్రోత్సాహం, పిల్లల అభివృద్ధికి తగిన బోధన పద్ధతులు అవలంబించడం, ఆరోగ్యం, పోషకాహార సేవలపై ప్రధానంగా దృష్టి సారించనున్నదని పద్మావతి వివరించారు. శిక్షణను పద్మావతి, ప్రధానోపాధ్యాయిని కోమలి చిత్ర, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, పోతవరంలో హెచ్ఎం గోపి గోవర్ధన్ ప్రారంభించారు. సూపర్‌వైజర్లు కృష్ణవేణి, హారతి, రెండు సెంటర్లలో 85 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

దేవరపల్లి: దేవరపల్లి మండలం యర్నగూడెంలోని బొల్లిన గంగరాజు జెడ్పీ హైస్కూల్‌లో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం నుంచి మూడు రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఐసీడీఎస్ పీఓ నాగలక్ష్మి ఈ తరగతులను ప్రారంభించి మండలంలోని 79 అంగన్‌వాడీ కేంద్రాల్లోని కార్యకర్తలకు 'పోషణ్ బీ.. పఢాయీ బీ' అంశంపై తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 0–3 ఏళ్లు, ప్రారంభ బాల్య సంరక్షణ, విద్యను (3–6) ప్రోత్సహించాలని ఆమె తెలిపారు. ఈసీసీఈ పాఠ్యాంశాలు, బోధన విధానాలపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలన్నారు. పోషణ-2, సాక్షం అంగన్‌వాడీ పోషణ ట్రాకర్, ఆహార పద్ధతులు, ఎస్ఏఎం, ఎంఏఎం పిల్లల నిర్వహణ, సూక్ష్మపోషకాల లోపాలు తదితర వాటిలో అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించడానికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. ఈ నెల 15 వరకు శిక్షణా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎం.విజయలక్ష్మి, ఎం.శశికళ, బి.విజయశాంతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగల్లు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల పోషణ, మానసిక వికాసంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో-2 సీహెచ్ సుభాకర్ సూచించారు. ఊనగట్ల హైస్కూల్లో గురువారం మార్కొండపాడు సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ సిబ్బందికి పోషణ్ పక్వాడ్‌పై శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల్లో శారీరక, మానసిక వికాసం పెంపొందించడంతో పాటు మంచి పౌష్టికాహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ జి.శిరీష, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మండల సారథుల నియామకం


కె.వీరవెంకటసత్య నారాయణ, దేవరపల్లి


వెల్లంకి సుబ్రహ్మణ్యం, నల్లజర్ల


వెలగా శ్రీరామమూర్తి, గోపాలపురం


ప్రతాపనేని శ్రీనివాస్, ద్వారకాతిరుమల

దేవరపల్లి/ గోపాలపురం: గోపాలపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు వైఎస్సార్ సీపీ నూతన కమిటీల అధ్యక్షులను నియమించినట్టు మాజీ మంత్రి, నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనిత గురువారం తెలిపారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఇప్పటి వరకూ పార్టీ నియోజకవర్గ అనుబంధ విభాగాలు, మండల కమిటీల అధ్యక్షుల నియామకం పూర్తయినట్టు వివరించారు. జిల్లా, రాష్ట్ర అనుబంధ విభాగాలకు కమిటీలను ప్రకటించాల్సి ఉందన్నారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి నూతన కమిటీలు కృషి చేయాలని ఆమె కోరారు. పార్టీ దేవరపల్లి మండల కమిటీ అధ్యక్షుడిగా కూచిపూడి వీర వెంకటసత్యనారాయణ (సతీష్) వరుసగా మూడో సారి నియమితులయ్యారు. నల్లజర్ల మండల అధ్యక్షుడిగా వెల్లంకి సుబ్రహ్మణ్యం, గోపాలపురం మండల అధ్యక్షుడిగా వెలగా శ్రీరామమూర్తి, ద్వారకాతిరుమల మండల అధ్యక్షుడిగా ప్రతాపనేని శ్రీనివాస్ (వాసుబాబు) వరుసగా మూడో సారి నియమితులయ్యారు. తమ నియామకానికి సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జి తానేటి వనితకు నూతన అధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు.

దోమ పారిపోయేలా..

వైద్య సిబ్బంది ఇంటింటా అవగాహన


గంటావారిగూడెంలో ఇంటింటా అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ అధికారి లక్ష్మణరావు

నల్లజర్ల: నిల్వ నీరే..దోమలకు ఆవాసం.వాటిల్లోనే లార్వా అభివృద్ధి జరిగి దోమల ఉధృతి పెరిగి వివిధ రకాల జ్వరాలకు కారణమవుతున్నాయని తాడేపల్లిగూడెం మలేరియా సబ్‌యూనిట్ అధికారి వై.వి.లక్ష్మణరావు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఇంటింటా అవగాహన కల్గిస్తున్నారు. నల్లజర్ల పీహెచ్‌సీ పరిధిలో గంటావారిగూడెం, దూబచర్లలో గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఇంటింటా నీటి నిల్వల వల్ల కలిగే అనర్థాలు, దోమల నివారణపై అవగాహన కల్గించారు. పంచాయతీ సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో క్రిమి సంహారక చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. ఇళ్లలో ఫ్రిజ్ వెనుక, పూలమొక్కల కుండీలలో, బయటపడేసిన కొబ్బరి బొండాలలో, మూతలేని సిమెంటు ట్యాంకులు, వదిలేసిన ప్లాస్టిక్ టబ్‌లు, రుబ్బురోళ్ల వంటి చోట్ల దోమలు ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటాయన్నారు. వీటిని నిర్వీర్యం చేసి దోమకాటు ద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధి రాకుండా కాపాడుకోవచ్చునని పిలుపునిచ్చారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ అన్నమ్మ, రాఘవ, ఏఎన్ఎం సువర్ణ, సుహాసిని, ఎం.ఎల్.హెచ్.పి దీప్తి, ఆశ కార్యకర్తలు శాంతకుమారి, రాణి పాల్గొన్నారు.

దోమ పోటు.. పాడికి చేటు

- గణనీయంగా తగ్గిన పాల దిగుబడి
- ఆందోళన చెందుతున్న రైతులు


ఊనగట్లలో పశువులకు ఏర్పాటు చేసిన దోమ తెరలు

చాగల్లు: పశువులకు దోమపోటు కారణంగా పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతోందని పాడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, చాగల్లు, మార్కొండపాడు, నెలటూరు తదితర గ్రామాల్లో అధిక శాతం రైతులు వరి సాగుతో పాటు పశువులను మేపుతుంటారు. ఇటీవల పశువులకు దోమపోటు బెడద ఎక్కువైంది. గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో దోమల ఉధృతి పెరిగింది. వేలాది రూపాయలు వెచ్చించి పశువులను కొనుగోలు చేసి దాణా పెట్టినా దోమపోటు వల్ల పాల దిగుబడి ఆశించిన స్థాయిలో రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులను దోమపోటు నుంచి కాపాడుకునేందుకు వాటి శరీరానికి వేపనూనె పూయడం, కాళ్ల వద్ద పొగ పెట్టడం, దోమతెరలు ఏర్పాటు వంటి చర్యలు తీసుకుంటున్నారు. వీటివల్ల అధిక శ్రమ, వ్యయం కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా పాల దిగుబడి పెరగకపోవడంతో కొంతమంది రైతులు తమ పశువులను అయినకాడికి అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం స్పందించి వ్యవసాయ శాఖ ద్వారా వేపనూనె, దోమ తెరలను రైతులకు ఉచితంగా పంపిణీ చేయాలని కోరుతున్నారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి


నల్లజర్లలో ప్రచారం నిర్వహిస్తున్న సుందరబాబు తదితరులు

నల్లజర్ల: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) అభ్యర్థి డీవీ రాఘవులును ప్రథమ ప్రాధాన్య ఓటుతో గెలిపించాలని సీఐటీయూ ఆధ్వర్యాన గురువారం నల్లజర్లలో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థల్లో ఈ ప్రచారం జరిగింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు మాట్లాడుతూ, పాలకుల వైఖరి వల్ల ప్రజల జీవితాలు కష్టాల పాలవుతున్నాయన్నారు. ఉపాధి దొరకడమే గగనంగా మారిందన్నారు. చదువుకున్న యువత సైతం చాలీచాలని జీతాలకు పని చేస్తున్నారన్నారు. జీవన భద్రత లేదన్నారు. పాలకులు మాత్రం ప్రజల జీవితాలను పణంగా పెట్టి, కార్పొరేట్ల ప్రాపకం కోసం వారికి అనుకూలమైన చట్టాలు చేస్తున్నారని విమర్శించారు. దీనిని తిప్పికొట్టేందుకు కార్మిక, రైతు సంఘాలు బలపర్చిన పీడీఎఫ్ అభ్యర్థి రాఘవులును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు కొక్కిరపాటి వెంకట్రావు, బొంగు వీరభద్రం, ఎం.జయమ్మ, అచ్యుత నాగరాజు, టి.శేషారావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు

ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తుల ఆవేదన


ప్రజాభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి సీతారామ్మూర్తి

కొవ్వూరు: ఇసుక ర్యాంపుల నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదని, దీనిపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని చిడిపి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. చిడిపి పంచాయతీ కార్యాలయం వద్ద ఇసుక ర్యాంపు ఏర్పాటుకు పర్యావరణ అనుమతులపై గురువారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి సీతారామ్మూర్తి వద్ద గ్రామస్తుల తమ సమస్యలను వివరించారు. ఇసుకను తరలించుకుపోతున్నారు తప్ప స్థానిక పంచాయతీకి ఏవిధమైన ఆదాయం సమకూర్చడం లేదన్నారు. గ్రామస్తుల అవసరాలకు సైతం ఇసుక ఇవ్వడానికి నిర్వాహకులు ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ర్యాంపు నిర్వహణను గ్రామస్తులకు అప్పగిస్తే గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. అధికారులు ర్యాంపు కేటాయించే సమయంలో పర్యావరణ పరిరక్షణ కోసం నిబంధనలను నిర్వాహకులు పాటించడం లేదన్నారు. ఓపెన్ రీచ్‌ల్లో కేవలం ఒక మీటరు లోతు మాత్రమే తవ్వాల్సి ఉండగా రెండు, మూడు మీటర్లు తవ్వుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఇదేమిటని ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేసి భయపెడుతున్నారని వైఎస్సార్ సీపీ నాయకుడు పామెర్ల నగేష్ ఆరోపించారు. 48.3 హెక్టార్లలో 4,81,000 క్యూబిక్ మీటర్ల ఇసుక లభ్యమవుతుందని డీఆర్వో సీతారామ్మూర్తి తెలిపారు. వాయు, నీటి కాలుష్యం, రానున్న రోజుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నట్లు ప్రకటించారు. ర్యాంపునకు పది కిలో మీటర్ల దూరంలో భూగర్భ, ఉపరితల నీటి నమునాలు సేకరించి పరీక్షిస్తామన్నారు. పర్యావరణ శాఖ ఈఈ ఎంబీఎస్ శంకరరావు, మైన్స్ ఏడీ డి.ఫణి భూషణ్‌రెడ్డి, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, స్థానిక సర్పంచ్ పాలడుగుల లక్ష్మణరావు పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం


యర్నగూడెంలో వేంకటేశ్వరస్వామి

దేవరపల్లి: యర్నగూడెంలో వేంచేసిన అలివేలు మంగ పద్మావతి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం బుధవారం రాత్రి అత్యంత వైభవంగా జరిగింది. మాఘమాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా శ్రీవారి మాస తిరుకల్యాణోత్సవం నిర్వహించినట్టు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శ్రీకాకొళపు కాశీ విశ్వనాథం తెలిపారు. అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగాను, స్వామి వారిని పెండ్లి కుమారుడిగా అలంకరించి వివాహ తంతు నిర్వహించారు. రాత్రి 7 గంటల నుంచి 11 గంటల వరకు కల్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం భక్తులకు కల్యాణ అక్షితలు, ప్రసాదాలు అందజేశారు.

పౌల్ట్రీల్లో పరిశీలన

ఉండ్రాజవరం: బర్డ్ ఫ్లూ నేపథ్యంలో మండలంలోని పౌల్ట్రీలను రాపిడ్ రెస్పాన్స్ సర్వైవల్ టీమ్స్ పరిశీలించి, నివేదికలు అందజేస్తారని చాగల్లు వెటర్నరీ హాస్పటల్ డాక్టర్ యు.ముఖేష్ గురువారం తెలిపారు. మండలంలో ఎనిమిది గ్రామాల్లో ఉన్న కోళ్లఫారాలను మూడు టీమ్‌లు పరిశీలిస్తున్నాయని అన్నారు. రాజానగరం ఏడీఏహెచ్ మూర్తి ఆధ్వర్యంలో తమ టీమ్ ఉండ్రాజవరం, పాలంగి గ్రామాల్లోని ఫారాల్లో కోళ్ల ప్రస్తుత పరిస్థితిపై సర్వే నిర్వహించి, నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈ ఫారాల్లో ఎక్కడా బర్డ్ ఫ్లూ వ్యాధి లక్షణాలు కనిపించలేదన్నారు. కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్స్ జి.ముత్యాలరావు, పశుసంవర్ధక శాఖ సహాయకులు జి.అంబేడ్కర్, ఆర్.గౌతం కుమార్, కె.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి

నిడదవోలు రూరల్: రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ డి.లక్ష్మీనారాయణ సూచించారు. గురువారం సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో వివిధ ప్రభుత్వ కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోళ్లలో బర్డ్ ఫ్లూ వ్యాధి నేపథ్యంలో గ్రామాల్లో కోడి మాంసం, గుడ్ల విక్రయాలను నిషేధించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పంచాయతీ, రెవెన్యూ, పశుసంవర్ధక, ఆరోగ్య శాఖాధికారులు సమన్వయంతో పనిచేసి బర్డ్ ఫ్లూ వైరస్‌పై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలని, ఇంకా కొన్ని గ్రామాల్లో ఫ్లెక్సీలు ఉన్నట్లు పలు ఫిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

కడియం: రానున్న శివరాత్రి వేడుకల నేపథ్యంలో మండలంలోని కడియపులంకలో ఉన్న అపర్ణా సమేత అనంతేశ్వర స్వామివారి ఆలయం వద్ద ఏర్పాట్లపై దక్షిణ మండలం డీఎస్పీ భవ్యకిషోర్ గురువారం సమీక్షించారు. కడియం ఇన్‌స్పెక్టర్ ఎ.వేంకటేశ్వరరావుతో కలిసి ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణతో ఏర్పాట్లపై చర్చించారు. ఆలయం వద్ద తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యలపై పలు సూచనలు చేశారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ బూత్‌లను కూడా డీఎస్పీ పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: కేంద్ర ప్రభుత్వం తక్షణమే న్యాయవాదుల రక్షణ చట్టాన్ని చేయాలని అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్నాలకోట వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో న్యాయవాదులతో కలసి ఆయన వినతిపత్రం అందజేశారు. న్యాయవాదుల రక్షణ చట్టం చేయాలని కోరుతూ అడ్వకేట్స్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సొసైటీ ప్రతినిధులు, న్యాయవాదులు గురువారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ ద్వారా ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వినతిపత్రాలు పంపించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, దేశంలో రోజురోజుకూ న్యాయవాదులపై దాడులు ఎక్కువ అవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని అరికట్టాలంటే తక్షణం కేంద్రం న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలన్నారు. అలాగే రాష్ట్రంలో అర్హులైన న్యాయవాదులకు రేషన్ కార్డులు, పెన్షన్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేల స్టైఫండ్ అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాశీ శ్రీనివాసరావు, రాష్ట్ర సహ కారదర్శి బీర అరుణ్‌కుమార్, రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి సోమిన రామకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిరిపురం గిరీష్, బ్రహ్మజోస్యుల ఫణికుమార్, ఈరేటి బద్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.